
# ఈ వారం కథ

# కొత్త అమ్మ



ధనరాజ జ్ఞానేశ్వర్

సాధారణంగా నేను కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం వేసే వుంటుంది. నాన్న ఆఫీసు నుండి ఇంటికి రావడానికి సాయంత్రం ఆరు గంటల నుండి రాత్రి పది గంటల దాకా సమయం తీసుకుంటుంది.

అంతదాకా నేను ఇంటి పని, వంట పని చూసుకుని, టి.వి.లో వార్తలూ, కార్యక్రమాలూ అన్నీ చూసి, తీరిగ్గా చదువుతూ కూర్చుంటాను.

నాన్నకు ఏదైనా పార్టీ వుండి ఇంకా ఎక్కువ ఆలస్యం అయినా కావచ్చు!

అందుకే రాత్రివేళ ఆ ఇంట్లో ఒంటరిగా వుండాలంటే ఏదో తెలియని భయం, జంకు కలుగుతుంది నాకు.

ప్రతి రోజూ నాన్న త్వరగా రావాలని, నాకు తెలియకుండానే దేవుని ప్రార్థించడం జరుగుతుంది. అలా నా ప్రార్థన ఆ భగవంతుడు విన్నవాడు నాన్న త్వరగా వస్తాడు. లేని నాడు ఆలస్యంగా వస్తాడు.

అన్నిటికీ భిన్నంగా ఈ రోజు తలుపులు కాస్త దగ్గరగా వేసి వున్నాయి. తలుపులకి తాళం వేసి లేదు. అంటే– తలుపులు ఎవరో తెరిచారన్నమాట.

పట్టపగలు ఆ ఏరియాలో దొంగతనాలు జరుగుతాయన్న భయం లేని లొకాలిటీ అది.

కాబట్టి వచ్చింది నాన్నే అయ్యుండాలి!

"ఇంత త్వరగా నాన్న రావడానికి కారణం ఏమై వుంటుందబ్బా!" అని ఆశ్చర్యపోతూనే, తలుపు తెరవబోతుండగా, ఎవరిదో స్త్రీ కంఠం విన్పించి, ఆఖరి క్షణంలో ఆగి పోయాను.

ఇది మరీ ఆశ్చర్యకరమైన విషయం నాకు.

ఇంతదాకా నాన్నకు పరిచయమున్న అమ్మాయిని నేను మాత్రమే! కాని మరెవరో లోపలి నుండి మాట్లాడడం వింటుంటే నాన్నకు నేను గాక ఇంకెవరో తెలిసే వుండాలన్న మాట.

అలాగే నిలుచుండి అస్పష్టంగా వినబడుతున్న మాటలు చెవులు రిక్కించి మరింత స్పష్టంగా వినడానికి ప్రయత్నించ సాగాను.

"ఈ వయసులో ఈ ఇంటికి ఏ అర్హతతో రాను చెప్పు! నీకా వయసుకెదిగిన కూతురుంది. ఆమె పెళ్ళి చేయాల్సిన బాధ్యత నీమీద వుంది. అంత భారాన్ని మోయాల్సి వుండగా, నేను ఇక్కడికి వచ్చి నీకు మరో సమస్య కాలేనుగా" అంది ఆ స్త్రీ కంఠం.

"అలా అనకు ప్రియంవదా! నాకు నువ్వు సమస్యవవుతావని నేనెన్నడూ భావించడం లేదు. ఇక అమ్మాయి పెళ్ళి విషయమంటావా! మనల్ని అర్థం చేసుకున్నవాడు ఆమెకు తగినవాడనిపించిన వాడు తటస్థ పడితే ఆ ప్రయత్నం చేద్దాం! అయినా ఇప్పుడు దాని వయసెంత. పద్దెనిమిదేళ్ళు. అంత త్వరపడాల్సిన అవసరమూ ఇప్పుడంతగా లేదు నా మాట విను" అని చెబుతోంది నాన్న కంఠం.

"చూడడానికి నీకది చాలా చిన్న సమస్యగానే కనబడుతుందేమో గానీ, రామ రామ సమస్య మరింత జటిల మవుతుంది. పెళ్ళికెదిగిన కూతుర్ని ఇంట్లో వుంచుకుని ఎవరినో పెళ్ళి చేసుకుని వచ్చారన్న అపఖ్యాతి భరించాల్సి రావడం చాలా బాధాకరమైన విషయం" అందామె తిరిగి.

"ఎవరా అపఖ్యాతి వేసేది? ఈ సంఘంలోని మనుషులేగా? వేస్తే వెయ్యనీ! నాకేం భయం? నా కూతురి మంచి చెడ్డ నేనొక్కడినే చూస్తూ, అవస్థల పాలయిన రోజుల్లో ఈ సంఘం నాకు తోడయిందా? ఈ రోజు నేను రెండో పెళ్ళి చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటే అది వేసే అపనిందలు మోయడానికి నాకేమవసరం!" నిర్లక్ష్యంగా అంటున్నారు నాన్నగారు.

సంఘాన్ని ఏమాత్రం అర్థం చేసుకోలేని నాన్న మనస్తత్వం ఇక్కడే బయట పడుతోంది. కాని ఆమె తను ఎంతో దూరం ఆలోచించి మాట్లాడుతున్న విషయం ఆమె మాటల ద్వారా వ్యక్త మవుతోంది.

"నీకు విషయం సరిగా అర్థం కావడం లేదు. సంఘం అంటే ఇక్కడ బయటి వ్యక్తులకి కాదు. నీ కూతురు విద్య కూడా ఈ సంఘంలోని మనిషేనన్న విషయాన్ని విస్మరిస్తున్నావ్" అంది ఆమె.

"అంటే–నీ అనుమానమంతా విద్య ఏమంటుందోననే అన్నమాట! అయితే సరే! రేపీపాటికి విద్యని ఒప్పించి, నీ సమక్షంలో చెప్పిస్తాను. అప్పటికయినా, నీ విక్కడికి రావడానికి అభ్యంతరం లేదుగా!" అన్నాడు నాన్న విషయమంతా పరిష్కారమైపోయినట్టుగా.

ఇక అక్కడ నా ఉనికి అనవసరంగా తోచింది. వారిద్దరి ముందు వారిని దోషులుగా నిలబెట్టే అవకాశం రాకముందే గబగబా అక్కడి నుండి వెళ్ళిపోయి, ఆ వీధి మలుపుకి చేరుకున్నాను.

అయిదు నిముషాల అనంతరం ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఓ స్త్రీ తన భుజాల చుట్టూ కొంగు కప్పుకుని గాభరాగా చుట్టూ పరికించి చూస్తూ, గబగబా రోడ్డు మీదికి వచ్చింది.

నేను అప్పుడే కాలేజీ నుండి వస్తున్నట్టుగా తల వంచుకుని నడుస్తూ, ఆమె ఎదురు కాగానే అప్రయత్నంగా తలెత్తి చూశాను. మరుక్షణం తీవ్రమైన ఆశ్చర్యానికి లోనయ్యాను!

ఆమె ఎవరో కాదు. మా లెక్చరర్–ప్రియంవద!

అంటే ఇందాక నాన్న మాట్లాడిన ప్రియంవద, ఈమే ఒకరేనన్నమాట!

"అందుకే ఇందాకట్నించి ఆ గొంతు ఎక్కడ విన్నానా?" అన్న అనుమానం పీకుతోంది. అప్రయత్నంగా "గుడీవినింగ్ మేడం!" అన్నాను అప్పుడే ఆమెను గమనించినట్టుగా.

ఇబ్బందిగా నవ్వి–"గుడీవినింగ్! ఆలస్యమైందేం విద్యా!" అంది అసందిగ్ధంగా.

"ప్రయివేటు క్లాసు జరిగింది మేడం!" చెప్పాను నేను 'ప్రయివేటు' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

ఆమె అది గమనించిందో లేదో గాని–"అలాగా" అంటూ గబగబా అక్కడి నుండి వెళ్ళిపోయింది.

చిన్నగా నాలో నేను నవ్వుకుని–ఇంటికి వచ్చాను. ఇప్పుడు తలుపులు బార్లా తెరచి వున్నాయి. విషయం తెలిసిందే కాబట్టి నాన్నని ఏమీ అడగలేదు.

నా పనిలో మునిగి వుండగా, నాన్న బట్టలు మార్చుకుని, ఎక్కడికో వెళ్ళి పోయాడు.

ఎక్కడికి వెళుతున్నదీ చెప్పలేదసలు! నేనూ అడగలేదు.

ఇందాక విన్న వారిద్దరి మాటలే నా మనసులో మారుమ్రోగుతున్నాయి. వారిద్దరి మధ్య నేను అనవసరంగా అడ్డుగా వున్నానేమో ననిపించ సాగింది నాకు.

ఇలాంటి సమస్యల్ని గురించి ఆలోచించగలిగే స్థాయి కాదు నాది. ఆని నా ఉద్దేశ్యం.

"అయినా నాన్న తన్ను అడుగుతానని ఆమెతో అన్నాడుగా! అంతదాకా అనవసరంగా ఆలోచించి బుర్ర పాడు చేసుకోవడ మెందుకు?" అని ఆ విషయానికి అంతటితో తాత్కాలికంగా 'ఫుల్‌స్టాప్' పెట్టాను.

* * *

ఈ వారంలో నాన్న ఏదో మిషమీద నన్ను తన దగ్గరకు పిల్చుకున్నాడు.

**రోజుకి గంటలు తొమ్మిది!**

మన భూమిమీద ఓ రోజు గడవాలంటే 24 గంటలు పడుతుందిగదా! అదే జూపిటర్ గోళంలో ఓ రోజు 9 గంటల 55 నిమిషాల్లోనే గడిచిపోతుంది! అంటే రోజుకి 9 గంటల 55 నిమిషాలన్నమాట! జూపిటర్ అతిపెద్ద గోళం. తమ కార్యకలాపాలకు 24 గంటలూ సరిపోని మనలోని కొందరు జూపిటర్ గోళంలో అయితే అసలు వుండలేరేమో! –కొడిమెల

తను ముందు నిలుచుండగా ఏదో మాట్లాడాలని ప్రయత్నించినా, అతనికి మనసు రాక ఏమీ లేదని చెప్పి పంపేవాడు అక్కడి నుండి.

విషయం నేను గ్రహించినా, ఏమీ తెలియనట్టుగా ప్రవర్తించినా వారం రోజులపాటు, అలా ఎక్కువ కాలం వుండడానికి నాకు మనస్కరించ లేదు. నాతో అలాంటి విషయాలను ప్రస్తావించడానికి ఆయనకు సభ్యతా సంస్కారాలు అడ్డుతగులుతున్నాయని గ్రహించి కూడా ఇంత తటస్థంగా ఎలా వుండగలను?

చివరకు ఓ రోజు ధైర్యంచేసి మా మేడంగారికో ఉత్తరం వ్రాశాను.

స్టాఫ్ రూంలో ఎవరూ లేని సమయంలో–వెళ్ళి ఆమె చేతిలో ఆ ఉత్తరాన్ని ఉంచి, వెనుదిరిగి చూడకుండా వచ్చేశాను.

వస్తున్న సమయంలో ఆమె మొహంలో కదిలే భావాలను గ్రహించాలని అనిపించినా ఎందుకో తలెత్తి ఆమె వంక చూడలేక పోయాను.

నే వ్రాసిన ఉత్తరంలోని విషయమిది–

"ప్రియమైన అమ్మకి!

నమస్కారములు! ఇంతకాలం లెక్చరర్‌గా వున్న మీరు ఈ క్షణం 'అమ్మ' ఎలా అయ్యారు? అన్న ప్రశ్న అర్థరహితమని మీకూ తెలుసు! గత పది రోజుల క్రిందట, మా ఇంటిలో నుండి మీరు బయటికి వచ్చిన విషయం నేను చూసినప్పటి నుండి మీరు నాకు మేడంగా కాకుండా అమ్మగా అనిపిస్తున్నారు. అందుకే– ఆ సంబోధనతో ఈ లేఖను ప్రారంభించాను.

నాన్న వారం రోజుల నుండి మీ మధ్య జరిగిన విషయాన్ని నాతో చర్చించాలని ప్రయత్నిస్తూ, చివరి నిమిషంలో మాట్లాడలేని అవస్థ గమనించి, చివరికి నేనే, ఈ విషయంలో చర్య తీసుకోక తప్పడం లేదు. మీరు నాకు తల్లిగా, మా నాన్నకు భార్యగా రావడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే తల్లిలేని పిల్లగా, ఆ బాధను ఇన్నాళ్ళూ అనుభవించాను. అమ్మంటే ఏమిటో, ఆమె గౌరవం ఎంతటిదో నాకు బాగా తెలుసు! అదీ గాక, నాన్న ఈ వయసులో మరో తోడు కోసం ఎంతగా పరితపిస్తున్నాడో నాకు తెలియంది కాదు. అయితే ఇందులో కేవలం మా ఇద్దరి స్వార్థం మాత్రమే నిండి వుందనడం సమంజసం కాదు. ఈ సమాజంలో ఒంటరి స్త్రీగా మీరనుభవిస్తున్న కష్టాలు, ఎదుర్కొంటున్న అనుభవాలు ఏ స్త్రీ కూడా అనుభవించకూడదన్న దూరాలోచనతో ఈ విషయం మీతో ప్రస్తావనకు తెస్తున్నాను. అందరం కలసి వుండడం వల్ల మా ఇద్దరికో తోడు, మీకో నీడ దొరుకుతుందన్న ఉద్దేశ్యమే తప్ప మరెలాంటి ఉద్దేశ్యం లేదు. దయచేసి పరిస్థితిని క్షుణ్ణంగా అర్థం చేసుకుని మాతో సహకరిస్తారని మా ఇంట్లో మీ స్థానం సుస్థిరమని తెలియచేస్తూ రేపు సాయంత్రం అయిదు గంటలకంతా ఆ యింటి ఇల్లాలుగా రావలసిందని కోరుతూ...

మీ

విద్యార్థిని...కాదు కాదు ఇక నుంచి మీ కూతురు 'విద్య'

అని వ్రాశాను.

ఈ విషయం నాన్నగారితో స్వయంగా చెప్పలేదు. ఆయన కూతురిగా, ఆయనకు వున్న సభ్యతా సంస్కారాలు నాకూ వున్నాయిగా– అందుకని.

మరునాడు సాయంత్రం మాత్రం ఇంటికి వెళ్ళే ముందు పూలు, పండ్లు స్వీట్స్ తీసుకుని బయలుదేరాను.

'అమ్మ' వచ్చి వుంటుందన్న నమ్మకంతో.

ఇల్లు చాలా దూరంలో వుండగానే పరిశీలనగా చూడసాగాను.

'అమ్మ' నా రాక కోసమే ఎదురు చూస్తున్నట్టుగా గుమ్మం దగ్గర నిలుచుని వుంది.